సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SK1 one NEWS HD

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా


www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 148 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | సోమవారం 17-08-2026


## రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క




- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం
- మేడారం వనదేవతల సమక్షంలలో చేయూత పింఛన్లకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- పలువురు మహిళలకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం
- హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన రేవంత్




## టీజీపీఎస్సీ కీలక ప్రకటన

- వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!
- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్

**హైదరాబాద్ :**

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్ల - మిగతా 2 లో

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



**హైదరాబాద్ :**

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత - మిగతా 2 లో

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- కేంద్రం పరిశీలనలో రెండో విడత 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టులు
- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను - మిగతా 2 లో

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'




- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన



## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

- రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్
- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

**అమరావతి :**

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానిక ంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం - మిగతా 2 లో

## మాజీ ప్రధాని వాజ్‌పేయీకి నివాళులు అర్పించిన ముర్ము, మోదీ



- సేవలను గుర్తు చేసుకున్న నేతలు
- అటల్ బిహారీ వాజ్‌పేయీ నివాళులు అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని
- వాజ్‌పేయి తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేశారన్న మోదీ
- కార్గిల్ యుద్ధంతో దేశ శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారన్న అమిత్ షా

**ఢిల్లీ :**

భారత మాజీ ప్రధానమంత్రి దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా దిల్లీలోని 'సదైవ్ అటల్' (వాజ్‌పేయీ స్మారక చిహ్నం) వద్ద ఆదివారం ఉదయం పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో సహా పలువురు ప్రముఖులు పాల్గొని మాజీ ప్రధానికి అంజలి ఘటించారు. 2018లో ఇదే రోజున తుదిశ్వాస విడిచిన వాజ్‌పేయీని ఈ సందర్భంగా మోదీ స్మరించుకున్నారు. వాజ్‌పేయీ ఒక అసాధారణ రాజనీతిజ్ఞుడు అని అభివర్ణించారు. ఆయన - మిగతా 2 లో

## ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

- కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!
- కిమ్ జాంగ్ ఉన్‌తో తన బంధం గొప్పదంటూ పాత ఫొటోను పంచుకున్న ట్రంప్
- అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై తీవ్రంగా స్పందించిన ఉత్తర కొరియా
- ఇది 'అణు కూటమి'గా మారుతోందని, తీవ్రంగా స్పందిస్తామని ప్యాంగ్యాంగ్ వార్నింగ్
- కొత్త స్థాయి ముప్పును కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- ఇటీవలే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ఉద్రిక్తతలను పెంచిన ఉత్తర కొరియా




**ఢిల్లీ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా - మిగతా 2 లో

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్

- పార్కు, యూనివర్సిటీలో కాల్పులు
- అమెరికాలో మళ్లీ పెరిగిన కాల్పుల ఘటనలు
- కెంటకీలోని ఓ పార్కులో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి
- నాలుగేళ్ల చిన్నారితో సహా నలుగురికి గాయాలు
- వర్జీనియా యూనివర్సిటీలో మరో ఘటన, ఐదుగురికి గాయాలు
- కొద్దిరోజుల క్రితం జార్జియా స్కూల్‌లోనూ కాల్పుల ఘటన



**ఢిల్లీ :**

అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రకృతి చేస్తున్న హెచ్చరిక



వర్తమానంలో లాభార్జన కోసం భవిష్యత్తును బలిపెట్టే నయా ఉదారవాద విధానాలు ప్రపంచాన్ని ప్రమాదపుటంచులకు తీసుకెళ్తున్నాయి. దశాబ్దాలుగా యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియాల్లో చోటుచేసుకుంటున్న కార్చిచ్చుల్ని పట్టించుకుని పర్యావరణ అనుకూల విధానాలు పాటించని ఫలితంగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 37 కోట్ల ఎకరాల్లోని అడవులు, పొదలు తగలబడ్డాయని ఒక అంచనా. ఇలా కార్చిచ్చులో చిక్కుకున్న ప్రాంతం మంగోలియా దేశ విస్తీర్ణానికి సమానమని చెబుతున్నారు. స్పెయిన్, ఫ్రాన్స్ అటవీప్రాంతాల్లో, కెనడా, రష్యాల్లో గత వారం రోజు లుగా వ్యాపిస్తున్న మంటల వల్ల ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఫ్రాన్స్, స్పెయిన్ కార్చిచ్చులైతే ఊహించశక్యం కానంత స్థాయిలో ఉన్నాయి. వాటిని అదుపు చేయగలిగా మని ఆ రెండు దేశాలూ చెబుతున్నా జనంలో భయాందోళనలు ఉపశమించలేదు. నైరుతి ఫ్రాన్స్‌లో పారిస్‌కు నాలుగు రెట్లు పెద్దదైన విస్తీర్ణంలోని అడవి తగలబడటంవల్లగిరోండ్ ప్రాంతంలోని జనావాసాలనుంచి రెండున్నర లక్షలమంది పౌరుల్ని ఆదరా బాదరాగా తరలించాల్సివచ్చింది. ముఖ్యంగా బోర్డావ్ నగరంవైపు ఆ మంటలు వ్యాపిస్తున్న తీరు జనాన్ని హడలెత్తించింది. అటు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ లక్షమందిని తరలించారు. దాని శివారు ప్రాంతాల్లో పలు జనావాసాలు తగలబడిపోయాయి. ఆ రెండూ యుద్ధ రంగాన్ని తలపింపజేస్తున్నాయని మీడియా కథనం. జరగాల్సిన నష్టం జరిగాక మంటల్ని ఏదోమేరకు అదుపు చేయటం సాధ్యమే. కానీ వాటివల్ల వ్యాపించే పొగవల్ల గాలి నాణ్యత దెబ్బతింటుంది. కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లతో కూడిన సూక్ష్మ ధూళి కణాలు పీల్చేగాలిలో వ్యాపించి ఊపిరి తిత్తులు, గుండెసంబంధ వ్యాధులతో ప్రజారోగ్యం క్షీణిస్తుంది. అరుదైన వృక్షసంపద, జీవవైవిధ్యం బుగ్గిపాలవుతుంది. దాని కారణంగా వడగాడ్పులు చెలరేగి జనంఅల్లాడిపోతారు. ఈ ఖండాల్లో ఏటా కార్చిచ్చులవల్ల 3,40,000 అకాల మరణాలుసంభ విస్తున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. 2023లో ప్రపంచ కర్బన ఉద్గారాల్లో కెనడా కార్చిచ్చుల వాటా 23 శాతమని అంచనా వేశారు. యూరప్ ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతున్నదని యూరోపియన్ యూనియన్(ఈయూ) పర్యవేక్షణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఫ్రాన్స్ కార్చిచ్చువల్ల ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాల్లోని పలు ప్రాంతాల్లో పొగ, ధూళితో కూడిన నీటియావిరి వ్యాపించి, అది మేఘాలుగా మారి, ప్రమాదకరమైన పెనుగాలులు, పిడుగుపాట్లు సంభవించాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా ఇలాంటి కార్చిచ్చులు మానవతప్పిదాలతోనే మొదలవుతాయి. కానీ వాతావరణ మార్పుల పర్యవసానంగా అవి వేగంగా విస్తరిస్తాయి. ఈ విషయంలో శాస్త్రవేత్తలు స్థూలంగా అంగీకారానికొచ్చినా, తమ నమూనాలు అందుకోలేనంత స్థాయిలో ఇవి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ తీవ్రతను పసిగట్టడానికి కొత్త ఉపకరణాలు అవసరం కావొచ్చన్నది వారి అభిప్రాయం. ఇప్పుడు స్పెయిన్, ఫ్రాన్సుల్లో మంటలు వ్యాపించిన అడవుల్లో పిక్నిక్‌లు, క్యాంప్ ఫైర్లు ఎక్కువ. అజాగ్రత్తగా ఉండే మనుషులవల్ల నిప్పు రాజుకోవటం, గాలిలో తేమ శాతం తక్కువుండే రాత్రివేళ మోడువారిన చెట్లు, ఎండుటాకులు అంటుకుని మంటలు వేగంగా వ్యాపించడం రివాజు. గత కొన్నేళ్లుగా ఈ కార్చిచ్చులవల్ల ఉత్పత్తయ్యే వేడి, పొగ ఆధారంగా పైరోక్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షరహిత పెనుగాలులతో కూడిన తుపానులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఆ వేడిగాలుల కారణంగా ఎక్కడెక్కడో పడే పిడుగులు మరిన్ని అగ్నిప్రమాదాలకూ, కార్చిచ్చులకూ దారితీస్తున్నాయి. విషపూరిత పొగ, బొగ్గు రేణువులతో ఉండే ఈ మేఘాలు అణు విస్ఫోటంలో వచ్చే పొగ మాదిరే దీర్ఘకాలం వాతావరణంలో అలుముకుని సూర్యరశ్మిని అడ్డుకుంటాయి. 2019--20లో ఆస్ట్రేలియా ఇలాంటి వాతావరణాన్ని చవిచూసింది. దానికి 'బ్లాక్ సమ్మర్' అని పేరుపెట్టారు. ఇకనైనా వాతావరణంతో ఆటలాడటం ప్రమాదకరమని ప్రభుత్వాలు గుర్తించాలి. గుప్పెడు కార్పొరేట్ సంస్థల లాభార్జన కోసం వాతావరణాన్ని బలిపెడితే ఊహకందని ఉత్పాతాలు కాటేస్తాయి. పర్యావరణం ధ్వంసమై మానవాళి మనుగడే పెను ప్రమాదంలో పడుతుంది. తాజా పరిణామాలు చేస్తున్న హెచ్చరిక ఇదే.

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది. ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు



రూ.600 కోట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'



**మొదటిపేజీ తరువాయి -** తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్'బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయీకి నివాళులు అర్పించిన ముర్ము, మోదీ

**మొదటిపేజీ తరువాయి -** దార్శనికత, నాయకత్వం, సుపరిపాలన, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. "అటల్ బిహారీ తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారు. ఆయన మాటలు, కృషి తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి. ఆయన నాయకత్వం మన దేశాన్ని బలోపేతం చేసింది. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై ఆయనకున్న శ్రద్ధ మనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుంది" అని మోదీ ఎక్స్‌పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా వాజ్‌పేయికి ఘన నివాళులర్పించారు. దేశ సేవకోసం తన జీవితాన్ని అంకితం చేసిన దేశభక్తుడిగా, రాజకీయవేత్తగా వాజ్‌పేయిని గుర్తుచేసుకున్నారు. "మాజీ ప్రధానమంత్రి, బీజేపీ వ్యవస్థాపకుడు, భారతరత్న, పూజ్య అటల్ బిహారీ వాజ్‌పేయి గారి వర్ధంతి సందర్భంగా, ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను. వాజ్‌పేయీ తన జీవితంలోని ప్రతి క్షణాన్ని దేశ సేవకు అంకితం చేసిన అత్యద్భుతమైన దేశభక్త రాజకీయవేత్త. అణు పరీక్షలు, కార్గిల్ యుద్ధం ద్వారా భారతదేశ శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు. అలాగే, విలువలతో కూడిన రాజకీ యాలు అంత్యోదయ, సుపరిపాలన అనే ఆశయాలను తొలిసారిగా క్షేత్రస్థాయికి తీసుకువచ్చారు. ఆయన మహోన్నత వ్యక్తిత్వం, నాయకత్వం ప్రతి బీజేపీ కార్యకర్తను దేశ నిర్మాణం వైపు ఎల్లకాలం ప్రేరేపిస్తూనే ఉంటాయి" అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వాజ్‌పేయీకి నివాళులర్పించేందుకు 'సదైవ్ అటల్' వద్ద హాజరయ్యారు. వాక్చాతుర్యం, పార్లమెంటరీ సేవ, రాజనీతిజ్ఞతకు ప్రసిద్ధి చెందిన వాజ్‌పేయి, భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరు. పార్టీ రాజకీయ ప్రస్థానాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో, మౌలిక సదుపాయాలు, దౌత్యం, ఆర్థిక విధానం, జాతీయ భద్రత వంటి రంగాల్లో భారతదేశం అనేక రంగాల్లో పరిణామం చెందింది. వాజ్‌పేయీ మూడుసార్లు భారత ప్రధాన మంత్రిగా పనిచేశారు. 1996లో ఆయన తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, అది కేవలం 13 రోజులు మాత్రమే కొనసాగింది. ఆయన 1998 నుంచి 1999 వరకు 11 నెలల పాటు, ఆ తర్వాత 1999 నుంచి 2004 వరకు పూర్తి ఐదేళ్ల పాటు ప్రధానమంత్రిగా పనిచేశారు. వాజ్‌పేయీ ఒక ప్రముఖ హిందీ కవి కూడా. ఆయన తన పార్లమెంటరీ జీవితం, ప్రజా జీవితం కారణంగా రాజకీయ వర్గాలకు అతీతంగా విస్తృతంగా గౌరవం పొందారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, 2015లో భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ఆయనకు ప్రదానం చేశారు. కాగా, వాజ్‌పేయి 93 ఏళ్ల వయసులో 2018 ఆగస్టు 16న కన్నుమూశారు. ఆయన జీవితం, రాజకీయ సేవ, వారసత్వాన్ని స్మరించుకునే సందర్భంగా ఏటా ఆయన వర్ధంతిని పాటిస్తారు.

## ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

**మొదటిపేజీ తరువాయి -** మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా-జపాన్-దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క

**మొదటిపేజీ తరువాయి -**

వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఆవిష్కరించిన సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రులతో కలిసి పరిశీలించారు. సీఎం సమక్షంలో కలెక్టర్ హేమంత్ బోర్ఖడే కొత్త కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ హేమంత్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అంతకు ముందు ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు. అనంతరం ఒంటరి మహిళలు, వితంతువుల కోసం ఉద్దేశించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మేడారం వేదికగా ప్రారంభించారు. ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం, పలువురికి కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మేడారం ప్రాంగణంలో మొక్కలు నాటిన రేవంత్ రెడ్డి మహిళలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్

**మొదటిపేజీ తరువాయి -** నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి



**మొదటిపేజీ తరువాయి -** ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## టీజీపీఎస్సీ కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి -** జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ




యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

సీమకిరణం నంద్యాల కర్నూలు తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా

# గౌరీ గోపాల్ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాలు

### ఆరోగ్యమే మహాభాగ్యం.. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్









**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 16 (సీమకిరణం న్యూస్):** ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. తన తండ్రి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా 16వ తేదీన కర్నూలులోని గౌరీ గోపాల్ హాస్పిటల్‌లో కర్నూలు నియోజకవర్గ ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 127 మంది ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో సుమారు రూ.6,000 విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా అందించారు. రక్తపరీక్షలు, ఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ, అల్ట్రాసౌండ్ స్కాన్/కేయూబీ, ఛాతీ ఎక్స్‌రే/కేయూబీతో పాటు చిన్నపిల్లల వైద్యులు, గుండె వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, దంత వైద్యుల సేవలను ఉచితంగా అందించారు. వైద్య పరీక్షల్లో 6 మందికి గుండె సంబంధిత సమస్యలు, 9 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఉన్న అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలన్నదే తమ లక్ష్యమన్నారు. గతంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల ద్వారా కూడా ఎంతోమందిలో అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తామని మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.

# నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ



**నంద్యాల ప్రతినిధి, ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్) :** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 17వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే ఎవవనిశీయిఎ.ఖజా.స్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రెడ్ కార్స్ ర్యాలీ






**నెల్లూరు,ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్ ):** 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్ దగ్గర ఉన్న రెడ్ కార్స్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి.. ఒకరికొకరు స్వాతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుకొని.. ఎంతోమంది మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ.. వారి సేవలను కొనియాడారు. అనంతరం రెడ్ కార్స్ అధినేత కంచర్ల అశోక్ కుమార్ పచ్చజెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్ల ర్యాలీ కరెంట్ ఆఫీస్ సెంటర్ నుంచి ప్రారంభమై గాంధీ బొమ్మ సెంటర్,ఆత్మకూరు బస్టాండ్ మీదుగా అన్నమయ్య సర్కిల్, అయ్యప్ప గుడి, వేదయపాలెం సెంటర్, కరెంట్ ఆఫీస్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రెడ్ కార్స్ అధినేత కంచర్ల అశోక్ కుమార్ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్ దగ్గర ఉన్న రెడ్ కార్స్ కార్యాలయంలో ఎంతో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరికీ సరసమైన ధరలకే రవాణా సౌకర్యం కల్పించాలని లక్ష్యంతో రెడ్ కార్స్ సంస్థను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాలలో రెడ్ కార్స్ సంస్థ ద్వారా ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్నామన్నారు. అన్ని కంపెనీల కార్లు రెడ్ కార్స్ లో అందుబాటులో ఉన్నాయని.. దూర ప్రాంతాలకు వెళ్లాలన్న, నగరాలలో లోకల్ లో కావాలన్నా.. 9121405050 ఈ ఫోన్ నెంబర్ కు సంప్రదిస్తే.. మీ ఇంటి వద్దకే కార్ వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళి, రామకృష్ణ,సురేష్,సాయి, నరసింహ,ప్రవీణ్,రెడ్ కార్స్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతో జీవించాలి

సి. ఐ ఇంతియాజ్ భాష



**డోన్ టౌన్, ఆగస్టు 16,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఉదయం వీక్లీ కౌన్సెలింగ్ లో భాగంగా పట్టణంలో ఉన్న రౌడీ షీటర్లు అందరికి సి ఐ ఇంతియాజ్ భాష కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగినది,పట్టణంలో రౌడీ షీటర్లు అందరూ సత్ప్రవర్తనతో జీవనం కొనసాగించాలని, రౌడీ షీటర్లు ఏదైనా నేరము లో పాల్గొనడం, శాంతి భద్రతలకు విఘాతం కల్గించడం చేస్తే చట్ట పరమైన పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడమైనది,

## డోన్ లో ఘనంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి వేడుకలు





**డోన్ టౌన్, ఆగస్టు 16,(సీమ కిరణం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 106వ జయంతి సందర్భంగా ఆయన తనయుడు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు.డోన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఆయన స్మృతులను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ప్రజా సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని అన్నారు.ముఖ్యమంత్రిగా,కేంద్ర మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి,రాయలసీమ ప్రగతికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు.రైతులు,పేదలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం తన తండ్రి రాజకీయ జీవితంలో ప్రత్యేకత అని,నిజాయితీ,నిబద్ధత,నిరాడంబరతతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు.

## సొందల్ మాలి సందర్భంగా దర్గా వద్ద పోలీసుల పర్యవేక్షణ





**నెల్లూరు,ఆత్మకూరు,ఏఎస్‌పేట, ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్):** ఏఎస్‌పేటలోని ప్రముఖ శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ అమ్మజాన్ దర్గాలో ఏడాదికి ఒకసారి నిర్వహించే ప్రత్యేక సంప్రదాయ ఆచార కార్యక్రమం సొందల్ మాలి నేడు జరగనుంది. ఈ సందర్భంగా మహిళలకు దర్గా లోపలికి వెళ్లి సమాధులను దర్శించుకుని గంధం పూసి ప్రార్థనలు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఏడాదికి ఒకసారి మహిళలకు లభించే ఈ అరుదైన సంప్రదాయ కార్యక్రమాన్ని వీక్షించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతో, ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్ సూచనల మేరకు, సీఐ గంగాధర్ పర్యవేక్షణలో స్థానిక ఎస్సై జిలానితో పాటు దుత్తలూరు ఎస్సై సుభాషిని, కండలేరు ఎస్సై భవాని, సంగం ఎస్సై భోజ్య నాయక్ సహా మొత్తం 60 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక దర్గా ఏవో మహమ్మద్ హుస్సేన్‌తో కలిసి ఎస్సై జిలాని, ఇతర ఎస్సైలు దర్గా పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల రాకపోకలు, మహిళల దర్శనం, ట్రాఫిక్ మరియు ఇతర భద్రతా అంశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

## గంటకు 320 కి.మీ. వేగంతో నీటి అడుగున భారత్ తొలి బుల్లెట్ రైలు.. ఎప్పుడంటే..!

భారతదేశంలో తొలిసారిగా ట్రాక్ నిర్మాణంలో జపనీస్ జె-స్లాబ్ బ్యాలస్ట్‌లెస్ ట్రాక్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. ఇది బ్యాలస్ట్ లేని కాంక్రీట్ స్లాబ్‌లపై ఆధారపడి ఉంటుంది. సబర్మతి, సూరత్, థానేలలో మూడు ఆధునిక రోలింగ్ స్టాక్ డిపోలను నిర్మిస్తున్నారు. ముంబై, అహ్మదాబాద్‌ల మధ్య నడవనున్న భారతదేశపు మొట్టమొదటి బుల్లెట్ రైలు కోసం దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## మహిళల ఆత్మరక్షణ కోసం తైక్వాండో ఎంతో అవసరం...

ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ



**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 16 (సీమకిరణం న్యూస్):** ఆడపిల్లలకు తల్లిదండ్రులు తైక్వాండోలో శిక్షణ ఇప్పించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని కిడ్స్ వరల్డ్ ఆవరణలో తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు డాక్టర్. శంకర్ శర్మ గ్రేడింగ్ టెస్టు పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ప్రాధాన్యత ను వివరించారు. మార్షల్ ఆర్ట్స్ లో యోగా, ధ్యానం, వ్యాయమం, ప్రాణాయామం మిళితమై ఉంటాయని దీంతో శరీరం దృడంగా ఉండి విద్యార్థులకు ఏకాగ్రత వస్తుందన్నారు. ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉండడంతో పాటు అమ్మాయిల ఆత్మరక్షణకు తైక్వాండో ఉపయోగపడుతుందన్నారు. మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ తీసుకున్న మహిళ భవిష్యత్తులో వచ్చే ఎలాంటి సమస్యలైన ఎదుర్కొనే ధైర్యం వస్తుందన్నారు. ప్రస్తుతం యువత సెల్ ఫోన్ కి ఎక్కువ అంకితం అవుతున్నారని సెల్ ఫోన్ లో వారి భవిష్యత్తుకు ఉపయోగపడే వాటిని మాత్రమే చూడాలని సూచించారు. ఈసందర్భంగా తైక్వాండో బెల్టులు, పౌష్టికాహారం క్రీడాకారులకు డాక్టర్. శంకర్ శర్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దొంగతనం కేసు ముద్దాయి అరెస్ట్ : సిఐ గంగాధర్



**నెల్లూరు, ఆత్మకూరు, ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్) :** ఆత్మకూరు పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఓ దొంగతనం కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. ఆత్మకూరు పట్టణంలోని జేఆర్ పేటలో నివసిస్తున్న వృద్ధ దంపతులకు సహాయకుడిగా ఆరు నెలల క్రితం పనిలో చేరిన విజ్ఞానపు వీర్రాజు తాను పనిచేస్తున్న ఇంట్లో నే 11 సవర్ల బంగారు నగలు, లక్షా 80 వేల 500 రూపాయల నగదును చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ జరిగిన విషయం తెలుసుకున్న ఇంటి యజమానులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు వీర్రాజును అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది నిందితుడి సమాచారం మేరకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాచిన 12 లక్షల 85000 ఇవ్వగలిగిన బంగారు నగలు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ గంగాధర్, ఎస్ఐ జంపానీ కుమార్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ కేశవ్ తదితరుల బృందం సమర్థవంతంగా దర్యాప్తు చేసి కేసును చేదించినట్లు సీఐ తెలిపారు. అలాగే ఎవరైనా తమ ఇళ్లల్లో సహాయకులుగా చేర్చుకునే సమయంలో వారి చరిత్రను పూర్తి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రత్యేకంగా అభినందించి. రివార్డు అందించనున్నట్లు ప్రకటించినట్లు సీఐ తెలిపారు.

## ఘనంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి వేడుకలు





**ప్యాపిలి, ఆగస్టు 16 (సీమ కిరణం న్యూస్) :** ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 106వ జయంతి వేడుకలను ప్యాపిలి పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోట్ల కుటుంబ అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, ఒకరికొకరు తీపి తినిపించుకుంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కోట్ల కుటుంబ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఆత్మకూరు సీఐ గంగాధర్

ఆత్మకూరు సీఐ గంగాధర్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది.



**నెల్లూరు/ ఆత్మకూరు, ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్):** విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల చేతుల మీదుగా సీఐ గంగాధర్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు ఆయనకు ఈ ప్రత్యేక గుర్తింపు దక్కింది. అవార్డు అందుకున్న సీఐ గంగాధర్‌ను ఆత్మకూరు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## ఆత్మకూరు ఆర్డీవో బి. పావనికి విశిష్ట సేవా పురస్కారం



**నెల్లూరు/ ఆత్మకూరు, ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్) :** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో బి. పావని విశిష్ట సేవా అవార్డును అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ఆమె ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యతో ఆర్డీవో కార్యాలయాన్ని ఆశ్రయించినా, సమస్యను వెంటనే పరిష్కరించేందుకు బి. పావని ప్రత్యేక చొరవ చూపుతున్నారని స్థానికులు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకే ఆమె ఈ అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రాంతంలో ఆమెకు అవార్డు లభించడంపై వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్డీవో బి. పావనికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## ఏఎస్ పేట ఎస్సై జిలానికి ఉత్తమ అధికారి అవార్డు




**నెల్లూరు, ఆత్మకూరు, ఏఎస్ పేట, ఆగస్టు 16, (సీమకిరణం న్యూస్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఏఎస్ పేట ఎస్సై జిలానిని ఉత్తమ అధికారిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల చేతుల మీదుగా ఎస్సై జిలాని ఉత్తమ అధికారి అవార్డును అందుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు ఈ అవార్డు లభించింది. ఎస్సై జిలానికి వరుసగా ఇది మూడవసారి ఉత్తమ అధికారి అవార్డు రావడం విశేషం. వరుసగా మూడు అవార్డులు అందుకోవడం పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు ఎస్సై జిలానిని అభినందించారు. విధి నిర్వహణలో మరింత అంకితభావంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎస్సై జిలాని తెలిపారు.

# భాషా సమైక్యతే భావ సమైక్యత



సుమారు ఆరు దశాబ్దాల (బలవంతపు) సహజీవనం, అందులోనూ 52 ఏండ్ల రాజకీయ పెత్తనం, ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ఆంధ్రవారి వలసలు, తెలంగాణ వనరుల దోపిడి, ఇక్కడి ప్రజలకు జరిగిన అన్యాయాలు, పక్షపాత ధోరణి-ఆంధ్రా, తెలంగాణ విడిపోవటానికి గల కారణాల్లో కొన్ని అయితే, వీటిని మించిన కారణం ఒకటుంది. అది భావసమైక్యత లేకపోవడం! ఈ సమైక్యత లోపించటానికి ముఖ్య కారణం భాషా సమైక్యత లేకపోవటం! ఆంధ్రులకు, తెలంగాణవారికి ఈ వైరుధ్యం, వారు విడిపోయి పదేండ్లయినా తగ్గకపోవటానికి ముఖ్య కారణం తెలుగు, ఆంధ్రం వేరు భాషలవటమే! ఆ రెండూ ఒక్క భాష కాదు, ఒక్క మూలంలోంచి కూడా రాలేదు. అందుకే ఈ రెండు ప్రాంతాల ప్రజలకు భావాల, సంస్కృతుల మధ్య సమైక్యత దశాబ్దాల పాటు కలిసి ఉన్నా ఏర్పడలేదు.తెలుగు భాష తెలంగాణవారి సొంతం, ఆంధ్రా ప్రాంతం వారి భాష సంస్కృత పదాలతో నిండి ఉన్న ఆంధ్ర భాష! ఇది తెలియని నెహ్రూను మోసగించి ఈ రెండు ప్రాంతాలను ఒక్క రాష్ట్రంగా భాషా ప్రాతిపదికన ఏర్పరిచినా ఆ కలయిక ఫలించలేదు. రాష్ట్ర విభజన అనివార్యమైంది. 'వెయ్యేండ్లు కలిసున్నా వేరు పడవలసిందే' అన్న గోరేటి వెంకన్న మాట నిజమైంది. శ్రీలంకలో స్థానిక లంకేయులకు, తమిళవారికి పొట్లాటలకు కారణం భాషే! కేరళలో సమంగా ఉన్న మూడు మతాల సఖ్యతకు కారణం వారంతా మాట్లాడేది ఒకే భాష కావటం! ఇప్పటికీ, తమ దేశం మత ప్రాతిపదిక మీద విడిపోయినా, బంగ్లాదేశ్‌లో ముస్లింలలో కూడా అధికులు బెంగాలీయే తమ మాతృభాషగా భావించటానికి కారణం కూడా భాషకున్న ప్రభావమే!కులం కంటే, మతం కంటే మానవ భావాలను ప్రభావితం చేసేది భాష! సుమారు 400 ఏండ్లు ముస్లిం రాజుల పరిపాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం ప్రశాంతంగా మనటానికి వారందరూ ఒకే భాష మాట్లాడగలగడం. మొదట్లో పర్షియన్, తర్వాత ఉర్దూ దేశ భాషలుగా ఉండి, ఇక్కడి హిందువులు తెలుగు, కన్నడం, మరాఠీ మాతృభాషలుగా ఉన్నా, పర్షియన్, ఉర్దూ భాషలను కూడా తమ భాషలుగా భావించటం వలన ప్రజల్లో మత వైరుధ్యాలు లేవు. ముస్లింలు దసరా, వినాయక చవితికి పండాలు అలంకరిస్తే, హిందువులు మిలాద్ ఉన్ నబీ, పీర్ల పండుగలు జరుపుకునేవారు. సమైక్యతకు సరైన అర్థం అదీ! తెలుగు, ఆంధ్రం విడి భాషలన్నది చారిత్రక ఆధారాలు కూడా నిరూపిస్తాయి. వాటిని పరిశీలిస్తే నిజాలు బయటపడతాయి.'ఆంధ్ర' అన్న పదం 'ఐతరేయ బ్రాహ్మణం'లో కనిపిస్తుంది. అందులోని ఒక కథ ప్రకారం.. తన నూర్గురు కొడుకుల మీద కోపగించిన విశ్వామిత్రుడు వారిని ఇంట్లోంచి వెళ్లగొడతాడు. అప్పుడు ఉత్తర భారతం నుంచి వారిలో కొందరు దక్షిణ దిశకు పయనించి దండకారణ్యం గుండా వచ్చి కృష్ణా, గోదావరి నదీతీరాలలో స్థిరపడ్డారు. ఈ ప్రయాణంలో వారు కొద్దిగా ద్రవిడ భాషలోని పదాలు తీసుకుని తాము అప్పటిదాకా మాట్లాడిన సంస్కృత భాషతో కలిపి వాడటం మొదలుపెట్టారు. అందుకే ఆంధ్రావారి భాష పూర్తిగా సంస్కృత పద భూయిష్టమైంది. వ్యాకరణ రీతులు కూడా పూర్తిగా సంస్కృత వ్యాకరణంతో కలుస్తాయి. పైగా వారిది ఆర్య సంస్కృతి. త్రిలింగ దేశంగా పిలవబడిన తెలంగాణ ప్రాంతంలో వాడే భాష ద్రవిడ భాష అయిన తెలుగు. మూడు శైవక్షేత్రాల మధ్య (శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం) ఉన్న ఈ భాష మాత్రమే తెలుగు. దీనిమీద సంస్కృత భాష ప్రభావం లేదు!భరత ముని రచించిన 'నాట్యశాస్త్రం' (2 బీసీ)లో ఆంధ్రుల జాతి గురించిన ప్రస్తావనలో, వారి భాష 'ఆంధ్రం' అని ఉంది. తెలుగు అన్న పదం ఈ రచనలో గాని, ప్రాచీన వ్మాయంలో గాని, బౌద్ధ రచనలలో గాని, ప్రాచీన ప్రాకృత రచనలలో గాని కనపడదు. ఆంధ్ర ప్రాంతంవారి భాష 'ఆంధ్రం' అని ఆ ప్రాంతంలోని బౌద్ధ ఆరామాల్లో కనిపిస్తే, తెలంగాణలో జైన, బౌద్ధ, ఆరామాల్లో ఇక్కడి భాష 'తెలుగు' అని ఉంటుంది. ఈ మధ్య మెదక్‌లో దొరికిన 1300 ఏండ్ల కిందటి శాసనంలో తెలంగాణ పురం (ప్రస్తుత తెల్లాపూర్) అన్న ఊరు ప్రత్యేక దేశమైన త్రిలింగ దేశంలో ఉందని స్పష్టంగా ఉంది. కాబట్టి ఈ దేశాలు, భాషలు రెండూ మొదటినుంచీ వేరని తెలుస్తుంది.ఇక యుగయుగాల చరిత్రలు చూద్దాం! త్రేతాయుగానికి చెందిన రామాయణంలో, ద్వాపరయుగానికి చెందిన మహాభారతంలో ఆంధ్రుల ప్రసక్తి ఉంది. రామాయణంలో సీతని వెతకటానికి వానరులను పంపిస్తూ దక్షిణ దిశలో ఉన్న కొన్ని దేశాలని వర్ణిస్తూ సుగ్రీవుడు ఆంధ్ర దేశం గురించి ప్రస్తావిస్తాడు. (కిష్కింధకాండ, 41 సర్గ, 12వ శ్లోకం). మహాభారతంలో వేదవ్యాసుడు కూడా సహదేవుడు ఆంధ్రులను చిత్తుగా ఓడించాడని రాశాడు.ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే.. కురుక్షేత్ర యుద్ధంలో ఆంధ్రులు అధర్మపరుడైన దుర్యోధనుడిని సమర్థించి, కౌరవసేనలో ఉండి పాండవులకు వ్యతిరేకంగా యుద్ధం చేశారు. (బహుశా చంద్రబాబు అప్పుడు ఆంధ్రదేశానికి రాజై ఉంటాడు ఆ జన్మలో!) ఆంధ్రుల గురించి రాసిన తన సుదీర్ఘ వ్యాసంలో పెప్పర్ స్ప్రే వీరుడు లగడపాటి రాజగోపాల్ ఈ విషయం మాత్రం జాగ్రత్తగా దాచిపెట్టాడు.రామాయణ, భారతాల్లోనే కాక, పురాణాల్లో, చరిత్రలో, సాహిత్యా ల్లో, అన్నిచోట్ల ఆంధ్ర ప్రాంతంలో నివసించేవారిది ఆంధ్ర జాతి అని, వారు మాట్లాడేది ఆంధ్ర భాష అని ఉందే తప్ప, 'తెలుగు' అన్న పదం వారికి సంబంధించి ఎక్కడా లేదు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఆంధ్ర ప్రాంతంతో ఎప్పుడూ కలిసిలేదు. అంతేకాదు, ఆంధ్రవారి ఆదికవి నన్నయ కాలం నుంచీ తమది ఆంధ్ర భాషే అని రాశారు కవులు, సాహిత్యకారులంతా. 'వ్యాసరచిత భారతం నయం ఆంధ్ర భాషగా నొనర్చి జగతి బొగడుగతి నన్నపార్య, తిక్కనను, క్రితక్రతు శంభుదాసు నెర్రకవి దలతు భక్తి' అని వ్యాసకర్తలు కవిత్రయాన్ని పొగిడారు. కవి నన్నెచోడుడు తన రచన 'కుమార సంభవం'లో ఈ రెండు భాషల భేదాన్ని చాలా స్పష్టంగా వివరించాడు. 'మును మార్గ కవిత లోకంబున నిల్పి ఆంధ్ర విషయంబన, దేశికవిత బుట్టించి తెనుగున' అని కవిత్వంలో కూడా ఈ భాషలు వేరని విశదీకరించాడాయన. కవిత్రయం వారి ఆంధ్ర భారతం తెలుగు బాగా వచ్చినవారికి కూడా అర్థం కాదు, దివాకర్ల వెంకటావధాని గారు దిగివచ్చి వివరిస్తే తప్ప! అదే పోతన 'భాగవతం' గాని, పాల్కుర్కి సోమన 'బసవ పురాణం' గాని ఎంతో సులభంగా అర్థమవుతాయి. కవిత్రయం కూడా తాము వ్యాసభారతాన్ని 'ఆంధ్రీకరించామని' అన్నారే కానీ, 'తెలుగీకరించామని' అనలేదు. అది ఆంధ్ర మహాభారతంగానూ, పోతనది తెలుగు భాగవతంగానూ మొదటినుంచీ అందరూ గుర్తించారు. నన్నయ ఆంధ్ర మహాభారతాన్ని రాయటాన్ని ప్రశంసిస్తూ తిక్కన ఇలా అన్నాడు. 'ఆంధ్ర కవితా విశారదుండు విద్యాదాయితుండొనరించె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్' (విరాట పర్వం, 6వ పద్యం). అంతేకాదు, తాను కూడా ఆంధ్రుల కోసమే ఈ పని చేశానని చెప్పుకున్నాడు. 'కావున భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి ఆంధ్రావళి మోదం బొరయునట్లు రచియించెదన్ కృతుల్ (విరాటపర్వం 30వ పద్యం). కవిత్రయంలో నన్నయ సగం రాసిన అరణ్యపర్వాన్ని పూర్తిచేసిన మూడోకవి ఎర్రన కూడా తన భాష ఆంధ్రమనే అన్నాడు కానీ, తెలుగు అని ఎక్కడా అనలేదు. 'శేషోన్నయం ఆంధ్ర భాషా సుజనోత్సవ మొప్పగ నిర్వచించెదన్' (నృసింహ పురాణం, 17వ పద్యం).ఇక 20వ శతాబ్దంలో కూడా ఈ రెండు భాషలు వేరన్న భావమే కనిపిస్తుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 150 ఏండ్లపైన కలిసి ఉన్న ఆంధ్రులు రాజకీయాలల్లో కూడా బాగానే పెత్తనం చేశారు. గుంటూరులో హైకోర్టు బ్రాంచ్ ఒకటి పెట్టినప్పుడు అక్కడి ఉద్యోగాల్లో ఒక తమిళుడిని నియమించారన్న కారణంతో ప్రత్యేక రాష్ట్ర పాట మొదలుపెట్టారు ఆంధ్ర రాజకీయ నాయకులు. తాము సగం మద్రాసు రాష్ట్రాన్ని ఆక్రమించటం, సంపద పోగు చేసుకోవటం బాగానే ఉంది.ఆంధ్ర ప్రాంతంలో తమిళుడికి ఒకే ఒక్క ఉద్యోగం ఇవ్వటం మాత్రం నచ్చలేదు. అక్కడ భాష అడ్డం వచ్చింది. తమ స్వరాష్ట్రం కోసం 1911 నుంచీ నడిపిన సభలను కూడా 'ఆంధ్ర మహాసభలు' అన్నారే కానీ 'తెలుగు సభలు' అనలేదు. ఆఖరికి ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభలో కూడా ఎక్కడా తాము తెలుగువారని చెప్పలేదు, ఆ పదమే వాడలేదు.నిజానికి వారు దురాశతో మద్రాసు నగరం తమకు కావాలని అడగకపోతే 1952లో కాకుండా, ఎంతో ముందుగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేది. కానీ, మద్రాసే తమ రాజధాని కావాలని పొట్టి శ్రీరాములును కూడా ఉద్యమంలో దింపి వాదించారు. తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలనేటప్పటికీ ఆంధ్ర రాజకీయ నాయకుల కళ్లు సుసంపన్న హైదరాబాద్ మీద పడ్డాయి. నిజానికి పొట్టి శ్రీరాములుకు హైదరాబాద్ రాష్ట్రం ఎక్కడుందో కూడా తెలియదు. నెల్లూరు జిల్లాలో పుట్టిన ఆయన మద్రాస్ కోసం పోరాడాడు. అయితే తర్వాత ఆంధ్ర నాయకులు ఆయన తెలుగు రాష్ట్రం కావాలన్నాడని, అన్నీ మార్చినట్టే, ఈ మాట చరిత్రలో ఇరికించారు. 1956 వరకు వచ్చిన వార్తా పత్రికలు ఆంధ్ర రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని గురించి రాశాయే గానీ, ఎక్కడా తెలుగు రాష్ట్రం అన్న మాటే లేదు. ప్రత్యేక రాష్ట్రమైన మూడేండ్లలోనే ఆర్థికంగా చతికిలపడ్డాక ఒకే వర్ణమాల ఉన్న తెలుగు, ఆంధ్రం ఒక్క భాషగా వాదించవచ్చని ఆంధ్ర రాజకీయ నాయకుల బుర్రలలో ఒక మెరుపు మెరిసింది. రెండు ప్రాంతాలను కలిపితే తెలంగాణకు వచ్చే నష్టాలను ఫజల్ అలీ కమిషన్ వివరంగా తన రిపోర్ట్‌లో ఇవ్వగానే ఖంగు తిన్న ఆంధ్ర రాజకీయ నాయకులు తెలుగు జపం మొదలుపెట్టారు.1955లో విడుదలైన మాయాబజార్ సినిమాలో కూడా గోంగూరని 'ఆంధ్ర శాకం' అన్నారే కానీ తెలుగు పచ్చడి అనలేదు. ప్రపంచంలోనే సుసంపన్న దేశంగా వెలిగిన హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రజలు హఠాత్తుగా ఆంధ్రులకు సోదరులై పోయారు. ఈ ప్రాంతాలు ఒక రాష్ట్రంగా ఏర్పడాలనే వారి వాదనకు కారణం భాషా సారూప్యం కాదు, భావసమైక్యత అంతకంటే కాదు. శతాబ్దాల తరబడి చరిత్రలో వైవిధ్యం, సంస్కృతిలో వైరుధ్యం ఉన్నా, ఆంధ్రం, తెలుగు ఒకటే భాష అనీ, తాము సోదరులమనీ అబద్ధపు ప్రచారం మొదలుపెట్టారు. దక్షిణ భారతదేశం గురించి తెలియని నెహ్రూను మభ్యపెట్టి, నమ్మించి ఒకే రాష్ట్రంగా ఏర్పరచగలిగారు. కానీ, దురదృష్టమేమంటే తమ సహజ పెత్తందారీతత్వం, దోపిడి గుణం మానుకోలేకపోయారు. ఇక్కడ అప్పటిదాకా కన్నడిగులు, మరాఠీలు, తమిళులు, మలయాళీల వంటి దక్షిణదేశ ప్రజలే కాక, ఉత్తర భారతం నుంచి వచ్చిన మార్వాడీ, పంజాబీ, గుజరాతీ మొదలైన భాషల వారు కూడా నిజాం రాష్ట్రంలో కనీసం రెండు శతాబ్దాల నుంచీ నివసించారు. అయితే వారు తెలంగాణ సంస్కృతిలో భాగమయ్యారే కానీ, ఈ ప్రాంతీయులను వ్యతిరేకభావంతో చూడలేదు. అంతేకాదు, నిజాం రాష్ట్రంలో జీతాలు ఎక్కువగా ఉండటం, నిజాం సైన్యంలో పరదేశీయులు కూడా ఉండేవారు. ఇరాన్, ఇరాక్, ఆఫ్రికన్, మధ్య తూర్పు దేశాల నుంచి వచ్చినవారు కూడా ఇక్కడ స్థిరనివాసం ఏర్పర్చుకొని సంతోషంగా తెలంగాణ ప్రాంతీయులైపోయారు. ఆఖరికి ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభలో కూడా ఎక్కడా తాము తెలుగువారని చెప్పలేదు, ఆ పదమే వాడలేదు.నిజానికి వారు దురాశతో మద్రాసు నగరం తమకు కావాలని అడగకపోతే 1952లో కాకుండా, ఎంతో ముందుగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేది. రామాయణంలో సీతని వెతకటానికి వానరులను పంపిస్తూ దక్షిణ దిశలో ఉన్న కొన్ని దేశాలని వర్ణిస్తూ సుగ్రీవుడు ఆంధ్ర దేశం గురించి ప్రస్తావిస్తాడు. (కిష్కింధకాండ, 41 సర్గ, 12వ శ్లోకం).

# మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ మధ్య తేడా తెలుసా



కొలెస్ట్రాల్ విషయానికి వస్తే, మంచి, చెడుగా పరిగణించబడే వాటి గురించి తరచుగా గందరగోళం ఉంటుంది. కొలెస్ట్రాల్ అనేది మీ రక్తంలో, మీ శరీర కణాలలో కనిపించే ఓ మైనపు లాంటి పదార్థం.హార్మోన్లు, విటమిన్ డి, ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి సహాయపడే పదార్థాల ఉత్పత్తికి ఇది చాలా అవసరం. అయితే, అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బులు వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అయితే సరైన గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరించడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వంటి జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా మీరు మీ కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచవచ్చు. దాంతో గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.


### మంచి కొలెస్ట్రాల్ అంటే ఏమిటి..?

హై-డెన్సిటీ లిపోప్రోటీన్ (హెచ్డిఎల్) కొలెస్ట్రాల్ అని కూడా పిలువబడే మంచి కొలెస్ట్రాల్ మీ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. హెచ్డిఎల్ కొలెస్ట్రాల్ మీ రక్త నాళాల నుండి అదనపు కొలెస్ట్రాల్ ను తొలగించి, విసర్జన కోసం మీ కాలేయానికి రవాణా చేయడానికి సహాయపడుతుంది. ఈ ప్రక్రియ మీ ధమనులలో ఫలకం ఏర్పడకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అధిక స్థాయిలో హెచ్డిఎల్ కొలెస్ట్రాల్ కలిగి ఉండటం మీ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, ధూమపానాన్ని నివారించడం ద్వారా మీరు మీ హెచ్డిఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుకోవచ్చు. కొవ్వు చేపలు, కాయలు, అవోకాడోలు, ఆలివ్ నూనె వంటి ఆహారాలు కూడా మీ హెచ్డిఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడానికి సహాయపడతాయి.

### చెడు కొలెస్ట్రాల్ అంటే ఏమిటి..?

తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్ (ఎల్డీఎల్) కొలెస్ట్రాల్ ను చెడు కొలెస్ట్రాల్ అని కూడా పిలుస్తారు. ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ మీ ధమనుల గోడలలో ఏర్పడి రక్త ప్రవాహాన్ని ఇరుకైన, నిరోధించే ఫలకాన్ని ఏర్పరుస్తుంది. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక స్థాయిలో ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ కలిగి ఉండటం గుండె జబ్బులకు ప్రమాద కారకంగా పరిగణించబడుతుంది. సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ కొవ్వులు తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం ద్వారా మీరు మీ ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు. ఎర్ర మాంసం, పూర్తి కొవ్వు పాల ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు వంటి ఆహారాలు మీ ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి.

# రోజూ ఒక అరటి పండు తింటున్నారా 30 రోజుల్లో మీ శరీరంలో జరిగే మార్పులు తెలిస్తే





అరటి పండులో గ్లూకోజ్ స్థాయి చాలా ఎక్కువగా ఉంటుంది. దీని నుండి మన శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటిపండు జీర్ణక్రియను బలోపేతం చేయడానికి ఉత్తమమైన పండుగా చెబుతున్నారు నిపుణులు.కడుపు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి అరటిపండు చాలా మేలు చేస్తుంది. అరటిపండులో ఫైబర్, ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కడుపు ఆరోగ్యాన్ని నియంత్రిస్తాయి. అటువంటి పరిస్థితిలో మీరు రోజుకు ఒక అరటిపండు తింటే మీ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.మీకు తరచుగా గ్యాస్, అజీర్ణం సమస్యలు ఉంటే అరటిపండ్లను తినడం అలవాటు చేసుకోండి. అరటిపండు కడుపులో ఉత్పత్తి అయ్యే ఆమ్లాన్ని తటస్థీకరిస్తుంది. ఎసిడిటీ కారణంగా ఛాతీలో మంటను తగ్గిస్తుంది. మీకు అధిక రక్తపోటు ఉన్నట్లయితే, ప్రతిరోజూ అరటిపండు తినడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే అరటిపండ్లలో పొటాషియం ఎక్కువగానూ, సోడియం తక్కువగానూ ఉంటాయి. ఈ కారణంగా ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. అధిక రక్తపోటును సాధారణ స్థితిలో ఉంచడానికి సహాయపడుతుంది.అవసరమైన పోషకాలు లేకపోవడం వల్ల శరీరం అలసిపోతుంది. కాబట్టి, మీరు పూర్తిగా తక్కువ శక్తిని అనుభవిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ అరటిపండు తినడం అలవాటు చేసుకోవాలి. ఎందుకంటే అరటిపండులో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి మీ శరీరానికి శక్తిని అందించడానికి పని చేస్తాయి. ఇందులో విటమిన్ ః%దీః% కూడా ఉంటుంది. ఇది శరీరంలో కార్బోహైడ్రేట్ల శోషణలో సహాయపడుతుంది. అరటిపండ్లు తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.ఎందుకంటే, అరటి పండులో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి అవసరమైన ఖనిజంగా పరిగణించబడుతుంది. ఒక నెల రోజుల పాటు ప్రతిరోజూ అరటిపండు తింటే, మీ గుండె మంచి ఆరోగ్యాన్ని మీరు గమనించవచ్చు. అరటిపండు మీ మనస్సుతో పాటు మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అరటి పండులో ఉండే విటమిన్ ః%జః% మెదడు ఆరోగ్యానికి తోడ్పడే సెరోటోనిన్‌ని విడుదల చేస్తుంది.అరటిపండులో మాంగనీస్ ఉంటుంది. ఇది చర్మ కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. ఇందులోని విటమిన్ సి చర్మాన్ని కాంతివంతంగా, ఆరోగ్యవంతంగా మారుస్తుంది. అరటిపండులో విటమిన్ బి6 ఉంటుంది. మీరు ప్రతిరోజూ ఒక మీడియం సైజ్ అరటిపండు తింటే, అది మీ శరీరానికి కావలసిన విటమిన్ బి6ని అందిస్తుంది. విటమిన్ 6 ఎక్కువ ఎర్ర రక్త కణాలను తయారు చేస్తుంది. అదనంగా, ఇది కార్బోహైడ్రేట్లు, కొవ్వులను జీవక్రియ చేస్తుంది. వాటిని శక్తిగా మారుస్తుంది.ఇంకా, ఇది కాలేయం, మూత్రపిండాల నుండి అనవసరమైన రసాయనాలను తొలగిస్తుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అరటిపండును సాధారణంగా అల్పాహారంతో తీసుకోవడం మంచిది. ఇది తక్షణ శక్తిని ఇస్తుంది. రాత్రిపూట దీన్ని తినడం వీలైనంత వరకు మానుకోవాలి.

# తెలుగు భాషకు అమరకోశం




పోయిన ఆదివారం రాత్రి 11.24 నిమిషాలకు అమరేశం రాజేశ్వర శర్మ కన్నుమూశారన్న వార్త నా హృదయాన్ని కలచివేసింది. రాజేశ్వర శర్మ గారి శిష్యకోటిలో నేనొకన్ని. ఆయన తన దారిని తానే నిర్మించుకొని, నలుగురికి సాహిత్యంలో దారిచూపిన దారిదీపం. ఆ మహానుభావుడు సంస్కృత, తెలుగు సాహిత్య వ్యాకరణాల వెలుగులను సాహితీ నేల మీద ప్రసరించిన దినపతి.గురువుగారు తరగతి గదిలో బాల వ్యాకరణం పుస్తకం చేతిలో లేకుండా గంగా ప్రవాహంలా పాఠం చెప్తుంటే ఒక్క సూత్రం నేను ఆయన బోధ నా నదిలో మైమరిచి తడిచి ముద్దయ్యేవాన్ని. ఆయన వామనుడే గానీ వ్యాకరణం, పరిశోధనం, విమర్శనం, పాండిత్యంలో విశ్వరూపం చూపేవారు. ఆయన నాకొక గ్లామర్ హీరో. నేను ఆయనకు ఆవగింజంత సహాయ పడినవాన్ని కాదు.సేవలు చేసినవాన్ని కాదు కానీ ఆయన పాడెను నా దుఃఖమే మోసింది. ఒక్కమారైనా పూలో, పండ్లో అర్పించలేక పోయాను కానీ నాలుగు గులాబీ పూలు అందరితో పాటు ఆయన పాదాల చెంత వేసిన దేహం నాది. నేను, రెంటాల, ఎస్వీ, మాలతి మరికొందరం ప్రియశిష్యులం. ఎంఏలో క్లాస్‌మేట్స్ అందరం సబ్జెక్ట్ టూర్లు వెళ్లినప్పుడు గోపాల కృష్ణారావు, ఇరివెంటి కృష్ణమూర్తి, అమరేశం రాజేశ్వర్మ శర్మ మా వెంట వచ్చేవారు. నేను పెద్ద గుడి గోపురం మీదికి పాకుతూ ఎక్కి సార్‌ను గట్టిగా పిలిస్తే అక్కడి నుంచి కింద పడిపోతానన్న ఆందోళనతో పిలిచిన మాటలు, చూపులు నాకెందుకో ఇప్పు డు జ్ఞాపకానికి వచ్చి కన్నీళ్లు తిరుగుతున్నాయి. గిరిజ సార్ కూతురు. నా క్లాస్‌మేట్. ఇప్పటికీ సార్‌కిచ్చిన గౌరవమే గిరిజకు ఇస్తూ వస్తున్నాను.కామారెడ్డిలో సరస్వతి రాజలింగ సభాపతి గార్లకు 5.9.1930లో రాజేశ్వర శర్మ జన్మించారు. ఆయన భార్య పేరు నరసమాంబ. ఆయనకు సంతానం గిరిజ, ఉమాపతి రావు, వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు, భారతి. రాజేశ్వర శర్మ గారి సహాధ్యాయి పోలా కృష్ణమూర్తి, ఆయన వల్లే నాకు ఏకాగ్రత అబ్బిందని చెప్పుకున్నారు. శర్మ గారి చదువు కామారెడ్డిలోని చిన్న మల్లారెడ్డి పాఠశాల నుంచి ప్రారంభమై ఉస్మానియా విశ్వవిద్యాలయం దాకా సాగింది. జటావల్లభ పురుషోత్తం, ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వేంకటావధాని దాకా ఎందరెందరికో శిష్యరికం చేసి సంస్కృ త, తెలుగు భాషలు నేర్చుకున్నారు.కామారెడ్డి ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆం ధ్ర భాషోపాధ్యాయులుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమై ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల దాకా ఆచార్యులుగా, డీన్‌గా, తెలుగు శాఖ అధ్యక్షులుగా వివిధ వృత్తిపరమైన పదవులు నిర్వహించారు. పదవీ విరమణ తర్వాత కూడా తొంభై నాలుగు సంవత్సరాలు వచ్చినా కూడా ఆంధ్ర దేశం నలుమూలల సంస్కృత, తెలుగు వ్యాకరణాలు బోధిస్తూనే పరలోకం వెళ్లిపోయారు.రాజేశ్వర శర్మ గారి రచనలు ప్రధానంగా నన్నెచోడుని కవిత్వం, వేదం వెంకటరాయశాస్త్రి రూపక సమాలోచన, అహోబిల పండితీయాం ధ్ర వివరణము, వైకృత చంద్రికాంధ్ర వివరణ ము, ఆంధ్ర వ్యాకరణ వికాసము, వేదం వెంకటరాయ శాస్త్రి వ్యాఖ్యానాలు, చరిత్ర పుటలు, శ్రీసాయి సచ్చరిత్ర ముక్తావళి గేయ ప్రబంధ ము, గజ్జెల విస్తరి, ఆత్మ నివేదనం ఆదిపర్వం, ఆత్మ నివేదనం ఉద్యోగ పర్వంతో పాటు అనేక అముద్రిత గ్రంథాలు ఐదు దాకా ఉన్నాయి. వివిధ పత్రికలలో మరె న్నో వ్యాసాలు వచ్చాయి. పోతన భాగవత పంచశతికీ, స్మారక సంచికకు సంపాదకులు. కామారెడ్డిలోని ప్రాచ్య విద్యా పరిషత్తు స్థాపకుడు.చరిత్ర పుటలు గొప్ప పరిశోధనా గ్రంథం. మా నిజామాబాద్ జిల్లా గురించి ఆయన ఎంతో చెప్పేవారు. బోధన్, ఇందూరు ఎప్పటినుంచీ ఉన్న వో రాజేశ్వర శర్మ గ్రంథం ద్వారానే తెలుసుకున్నాను. క్రీ.పూ. ఒకటి రెండు దశాబ్దాల మధ్యకాలంలో జైనముని రాసిన 'దనభత్తి' అనే ప్రాకృత గ్రంథం లో 'పొదనం'లో పోదనం-బోదనం-బోదన్‌గా మారిన తీరునూ ఋషభదేవుని రాజధాని బోధన్ అని రాజేశ్వర శర్మ గారు వ్యక్తీకరించినదే, పరిశోధించినదే ప్రథమ ప్రామాణికం. అలాగే ఇంద్రవర్మ నిర్మించిన నగరం ఇంద్రపు రి. ఆ ఇంద్రపురే నేటి ఇందూరు అని మొట్టమొదట చెప్పినవాడు అమరేశం రాజేశ్వరశర్మ గారు.రాజేశ్వరశర్మ తొలినాళ్ళ నుంచే గొప్ప పండితుడు, విమర్శకుడు. ఆయన రాసిన కుమారసంభవ కావ్యవిమర్శ ఓ విధంగా సిద్ధాంత గ్రంథంగానే చెప్పాలి. నన్నెచోడుని జాను తెనుగునూ ఆనాటి భాషా స్థితిగతులు షష్ఠ్యంతాల వంటివి ఎన్నో విషయాలను పరిశోధించి చూపారు. కుమార సంభవము ప్రథమ ప్రబం ధం అన్నది కూడా శర్మ గారే. ఆరుద్ర గారు సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో అక్కడక్కడా తన కు ప్రామాణికం అనిపించినవి చెప్పాల్సి వస్తే రాజేశ్వర శర్మ గారినే ఉటంకించారు. ఆయన భాషా పాండిత్యానికీ, సాహిత్య విమర్శకు అహోబిల పండితీయాంధ్ర వివరణం గానీ గజ్జెల విస్తరిలోని పదౌచిత్యాలు నేడు భాషనభ్యసించే వారికి మణిపూసలే.రాజేశ్వర శర్మ గారి 'ఆంధ్ర వ్యాకరణ వికా సం' రెండు సంపుటాలుగా ప్రచురితమైన ఉస్మానియా నుంచి వచ్చిన వ్యాకరణ సిద్ధాం త గ్రంథాలలో ఇదే ప్రామాణికం నేటికి. ఆయన ఇంటిపేరు వ్యాకరణం అనిపించేటం తటి గొప్ప గ్రంథం ఇది. విరామనెరుగని వినూత్న కృషి ఇందులో ఉంది. ఆత్మ నివేదనం ఆయన ఆత్మకథ. దాన్ని రెండు భాగాలుగా ప్రచురించారు. ఆత్మ నివేదన ఆదిపర్వం. ఆత్మ నివేదన ఉద్యోగపర్వం రాసి వెళ్లిపోయారు. విశ్రాంతి పర్వం రాయవలసి ఉండె. ఆయన అధ్యయన, ఉద్యోగాల ప్రస్థానాలు నేటి తరానికి గొప్ప స్ఫూర్తినిస్తాయి. సాహిత్య సేద్యం చేసేవారికి ఆయన రచనలు వెన్నెముకగా నిలుస్తాయి.

# శబ్దార్థ హృదయ సంవేదన

యదార్థభావం వ్యథార్థ రూపంలో బయటపడితే అది ఫణి మాధవి కవిత్వం. రామాయణ మహా కావ్య సృజన కూడా శోకం నుంచే శ్లోకమై, కథనమై, కవిత్వమై, ఇతిహాసమై, చారిత్రక ప్రమాణమై, భారతీయ జీవన వేదమై భాసించింది. కాంతి పుంజానికి వెనకాల చీకటి ఉన్నట్లు సంతోషం వెనక దుఃఖం ఉంటుంది. సామభేదలో కవిత్వం అర్థవంతమై, వేదనారోదనలలో భేదం భావ యుక్తంగా రక్తి కట్టినది.బాధతో నిండిన హృదయంలో మొలకెత్తిన భావ జ్వాలలకు ఆలోచనాజ్యం పోసి అక్షరాలలో ప్రజ్వలింపజేశారు ఫణి మాధవి. వామపక్ష వాద కవుల ప్రభావం ఆమెపై ఒకింత ఎక్కువగానే ఉంది. అందుకే ఆ భావన ఆమె కవితల్లో తొంగిచూస్తూనే ఉంటుంది. సచేతనమైన శరీరం నిర్జీవమైతే, బాహ్య ప్రపంచ బంధాల నుంచి విడుదలైనప్పుడు అది మరణమవుతుంది. ఆ మరణానికి కూడా కబురంపట మంటే!..'మొన్న ఆఖరిసారిగా మరణించినప్పుడుశోకగానం ఆలపించలేదేం!?' అంటూ మరణం గురించి సరికొత్తగా చెప్పారు.

**'దెబ్బ కాయటం తెలుసులే కానీ**
**రాయికెందుకో ఉబలాటం**
**పదేపదే గాయపరచడమే లక్ష్యం' అంటూ**

రాళ్లలోనూ మనసు ఉంటుందని కొంగొత్తగా చెప్పారు. కనిపించకుండా విసిరిన చేయి అసలు ముద్దాయిగా తెలిశాక,




తగిలిన గాయాన్ని సాక్ష్యంగా చూపెడుతుంది. మానవ జీవన జనన మరణ పరిభ్రమణంలో ఇది అనివార్యం. చనిపోయిన ప్రతిసారి కొత్తగా పుట్టక తప్పదు. ఆ పుట్టుక ఎలాంటిదనేదే ప్రశ్నార్థకమవుతుంది. బతకటం కష్టమైనప్పుడు మరణం అనివార్యమే కదా! ఇది చర్విత చరణం. అది కొత్తేమీ కాదు, కొత్తగా తెలుసుకున్నట్టు అనుకుంటాం. అదే మానవ జీవితంలో విచిత్రం. 'కబురు' కవితలో ఈ ధ్వని ఉంటుంది.'జై రామ రాజ్యంలో రావణ రథం ఊరేగుతుంది పాండవ ధర్మ పాలనలో కీచక జయధ్వానాలు మిన్నంటుతున్నాయి' అంటూమతోన్మాదులను, వేర్పాటు వాదనను సమర్థించేవాళ్లను అందలాలు ఎక్కిస్తే దుర్మార్గమే రాజ్యమేలుతుందని చెప్పారు.అఘాయిత్యాలు చేసేవాళ్లు కూడా అభినందనల కరచాలనం చేస్తారని, అవకాశం దొరికితే ఆబగా కబళించాలని చూస్తారని, తన భావాలు అరణ్య రోదనలేనని, కుచించుకుపోయిన ఆడతనం మహిళా దినోత్సవానికి పెద్దగా స్పందించదని.. మనుషులు పరిణతి చెంది మహిళల్లో తల్లిని, చెల్లిని చూడగలిగితే నిర్భయంగా తన భౌతిక దేహంపై మోజు పడని మగరాయుళ్ల ముందు కూడా ధైర్యంగా వెళ్లగలిగితే, అది నిజమైన మహిళా దినోత్సవమనేది కవయిత్రి ఉవాచ.'తన అరుపులు అరణ్య రోదనలేనని ఆమె మౌనంగా తిరుగు పయనమైంది' అంటూ 'ఎప్పటిలాగే ఎప్పటిలాగే' కవితలో తన ఆంతర్యాన్ని చెప్పారు కవయిత్రి. నాన్న లేని కుటుంబ వేదన చెప్పినా, అమ్మే నాన్నయిందని అమ్మని ఆకాశానికెత్తినా,'పూర్ణం మిగలాలంటే పూరించాల్సిందేదో ఉంది అర్థం చేసుకోలేని ఆల్గారిథం బతుకు పుస్తకం నిండా' అని గణితం చెప్పినా, కిం కర్తవ్యంలో లోపలి చీకటిని పదాల్లో ఒంపినా, పెదాలపై పూసిన నవ్వును మనసుకు పట్టించుకోవడం, దేనికోసమంటే.'చేతనకు రాదారి చీకటేనని నిజాన్ని ఎరుక బట్టటం' అని చెప్పినా కవయిత్రికే చెల్లుతుంది.చివరి కవిత 'వెన్నుచూపకు'లో 'మనసు ఉక్కిరిబిక్కిరైనప్పుడు పక్కన కిటికీ తెరుస్తుంది. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ, ఊపిరి ఒరిపిడిలోనూ భావం వదల్లేదని చెబుతుంది. గదిలోని చీకటి కాటుకలా నల్లనిదైనా దానిని ఏ వెలుగూ మసక బార్చదు' అంటుంది కవయిత్రి. మధ్య పుటలలో మానవ జీవిత సంగ్రహ సారాన్ని. 'ఉరిమే ఉరుముల మబ్బులలో మెరిసే మెరుపుల తళుకులలో కురిసే వడగళ్ల వర్షపు చినుకులు'గా కవిత్వీకరించారు. సామభేద గురించి చెప్పాలంటే ఇంకా చాలా ఉంది. ప్రతిఒక్కరూ చదవాల్సిన మానవ జీవన సంవేదనలు కలగలిసిన కవిత్వ సంపుటి సామభేద.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com